క్లుప్తంగా

అప్పలాయగుంటలో పెద్దజీయర్ స్వామి



ప్రసన్నుడి ఆలయంలో పెద్దజీయర్

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని సోమవారం తిరుమల జీయర్ మఠానికి చెందిన పెద్ద జీయర్ స్వామి దర్శించుకొన్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆలయ చరిత్ర, ఆపాదమస్తకం ఆభరణాల వివరాలను తెలియజేసి, హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

చదరంగంలో విద్యార్థిని ప్రతిభ



గెలుచుకున్న కప్పుతో విద్యార్థి నవ్య

నగరి: మండలంలోని ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.నవ్య చెస్ ఆటలో ప్రతిభ కనభరచింది. చిత్తూరు ఓపెన్ టోర్నమెంట్ చెస్ పోటీలలో పాల్గొన్న దివ్య అండర్–15 విభాగంలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, కోచ్ ఆనందమోహన్‌ను, పీడీ వెంకటేశ్వర్లును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ అభినందించారు.

పూల గెరిగ ఊరేగింపు



పూల గెరిగను ఊరేగిస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురంలో సోమవారం పూల గెరిగకు ప్రత్యేక పూజలు చేశారు. గంగజాతరలో భాగంగా చెంజమ్మకు పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గ్రామ దేవత ముత్తుమారియమ్మన్ ఎదుట 50 మూరల పల్లెపూలతో పూల గెరిగలు చేసి గ్రామాల్లో ఊరేగించారు. పూల గెరిగ మోసే భక్తుడి కాళ్లని పసుపునీటి తో కడిగి కొబ్బరికాయకొట్టి, కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


కోలాహలం.. నిమజ్జనోత్సవం




నిమజ్జనానికి బయలుదేరుతున్న గణపయ్య

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని దిగవూరు, బీసీ కాలనీలో సోమవారం వినాయక నిమజ్జనోత్సవం కోలాహలంగా సాగింది. భక్తులు, యువకులు చవితి సందర్భంగా పూజలందుకున్న గణనాథులను నిమజ్జనానికి తరలించారు. పలు గ్రామాల్లో విఘ్ననాథుడిని ఊరేగించారు. నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

రాత్రి వర్షం... పగలు ఉక్కపోత





రాత్రి సమయంలో కుండపోత(పైఫొటో), పగటి పూట తీవ్రంగా కాస్తున్న ఎండ

కార్వేటినగరం: వాతావరణంలో విభిన్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రెండు వారాలుగా రోజూ రాత్రి వర్షం, పగలంతా ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు దోమల బెడద పెరిగి ప్రజలు రోగాల బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. సాయంత్రం ఆరు గంటలైతే కారు మబ్బులు కమ్ముకుని ఆకాశానికి చిల్లులు పడినట్లు వర్షం దంచికొడుతోంది. దీంతో ఎన్నడూ లేని విధంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల పొలం పనులకూ ఆటంకం కలుగుతోందని రైతులు చెబుతున్నారు.

సన్మానం

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖలో ఏఎస్‌ఐగా పదవీ విరమణ చేసిన మునుస్వామిని సోమవారం చిత్తూరు ఎస్పీ మణికంఠ ఘనంగా సన్మానించారు. చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో యూనియన్ నాయకులు, అధికారులతో కలిసి మునుస్వామిని సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

జాతర సందడి ప్రారంభం

పండుగ అంటే జాతరే.. తెలుగు నాట ఎన్ని పండుగలు వచ్చినా సరే... జాతర కథే వేరంటారు పాత తరం పెద్దలు. అంటు వ్యాధులు ప్రబలకుండా, కరువు కాటకాలు లేకుండా, వర్షాలు సమృద్ధిగా కురుస్తూ, పంటలతో పొలాలు కళకళలాడుతూ అందరూ సుఖసంతోషాలతో జీవించేలా దీవించమ్మా అంటూ ప్రజలంతా కలిసికట్టుగా గంగమ్మకు చేసే పూజలే జాతర. నేటితరం యువత సైతం గంగమ్మ శక్తిని గుర్తించి జాతర వేడుకల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారు. గంగ జాతర విశిష్టతను గుర్తించిన గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం విదితమే.

గంగమ్మ తల్లి ప్రతిమలు



ఆలయంలో కొలువైన పిడికిలి గంగమ్మ



- నేడు జాతర చాటుబండి
- రేపు గంగమ్మ దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన జాతర కమిటీ

పుత్తూరు: గ్రామ దేవత గంగమ్మ జాతరను పుత్తూరు ప్రజలు ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఏటా శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతంతో పాటు శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజుల స్వామి తిరునాళ్లు తర్వాత పుత్తూరు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే జాతరకు ముందు వచ్చే మంగళవారం నాడు గ్రామ దేవత ఆరేటమ్మకు భక్తుల స్వహస్తాలతో పాలాభిషేక బ్రహ్మోత్సవాన్ని నిర్వహించారు. గత ఆదివారం రాత్రి గంగ జాతర చాటింపు వేశారు. సోమవారం ప్రారంభమైన గెరిగ ఊరేగింపు మంగళవారం వరకు కొనసాగనున్నది. మంగళవారం రాత్రి 8 గంటలకు చాటుబండి ఊరేగింపు నిర్వహించనున్నారు. 3వ తేదీ బుధవారం స్థానిక బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలిలో గంగమ్మను ప్రతిష్ఠించి జాతర నిర్వహిస్తారు. ఇందుకోసం బజారు వీధిలోని నాలుగు వీధుల కూడలి వద్ద గల పిడికిలి గంగమ్మ ఆలయాన్ని జాతరకు సిద్ధం చేశారు. చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, అమ్మవారి ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలు, ఇరువైపులా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి ప్రతిమలతో కూడిన విద్యుత్ దీప కటౌట్లు, వేపాకు తోరణాలతో పట్టణాన్ని సుందరంగా అలంకరించారు. దీంతో పట్టణంలో జాతర సందడి సంతరించుకొంది.



ప్రారంభమైన రెండు గెరిగల ఊరేగింపు

చాటుబండి ప్రత్యేకత

మంగళవారం రాత్రి 8 గంటలకు బజారు వీధిలోని గంగమ్మ ఆలయం నుంచి నిర్వాహకులు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా బయల్దేరి కాపువీధిలోని కేశావాచారి కుటుంబంవారు తయారు చేసిన చాటుబండికి పూజలు చేస్తారు. అక్కడ నుంచి చాటుబండిని తీసుకొని మండపం వద్ద ఉంచి పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆరేటమ్మ ఆలయం వద్దకు వెళ్లి పసుపు కుంకుమ సమర్పిస్తారు. తిరుగు ప్రయాణంలో దివిలి వెంకట్రాయులు మందడి కుటుంబం వారిచే చాటుబండి బలిదానం నిర్వహిస్తారు. అక్కడ నుండి కుమ్మరి కన్నయ్య ఇంటికి వెళ్లి గంగపెట్టి తీసుకొని మండపం వద్దకు చేరుకొంటారు. అక్కడ అన్నంతో దీపం వెలిగించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం చాటుబండిని మంగళ వాయిద్యాలు, బాణాసంచా నడుమ కాపువీధి, బజారువీధి, నగరం రోడ్డు, అమ్మోరుగుంట వీధుల్లో ఊరేగిస్తారు. అర్ధరాత్రి అమ్మోరుగుంట నుంచి మట్టిని సేకరించి ఆలయం వద్దకు తీసుకొస్తారు. బుధవారం తెల్లవారు జామునకు అమ్మవారి ప్రతిమను సిద్ధం చేస్తారు.

రెండు గెరిగల ఊరేగింపు

గంగ జాతరను పురస్కరించుకొని సోమవారం నుంచి మంగళవారం వరకు రెండు రోజుల పాటు గెరిగ నిర్వహిస్తారు. గ్రామం పెద్దది కావడంతో పాటు ప్రతి వీధిలోకి గెరిగ తిరిగి రావాల్సి ఉండడంతో రెండు గెరిగలు చెరో పక్క తిరగడం విశేషం. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగే గెరిగకు ప్రతి ఇంటి వద్ద కర్పూర హారతులిచ్చి కొలుస్తారు.

తొలి పూజ ఇలా..

బుధవారం ఉదయం 4 గంటలకు అమ్మవారి ప్రతిష్ఠ అనంతరం తరతరాలుగా వస్తున్న ఆనవాయితీగా కోడి, మేకపోతు, దున్నపోతులను బలిదానం చేయడంతో అమ్మవారు కనులు తెరుస్తారు. అమ్మవారి తొలి హారతిని బెస్త సంఘ పినపెద్దకు ఇస్తారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొంటారు. మధ్యాహ్నం 1 గంటకు సాళ్వాకం కులస్తులు నగరి కుంభం వేస్తారు.

ముత్యాల హారతితో నిమజ్జనం

బుధవారం రాత్రి 7 గంటలకు కాపువీధిలో పాట కచేరీ నిర్వహిస్తారు. 9 గంటలకు బెస్త సంఘం వారు గంగమ్మకు ముత్యాల హారతి ఇస్తారు. దీంతో జాతర పరిసమాప్తి అవుతుంది. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొని వెళ్లి అమ్మోరుగుంటలో నిమజ్జనం చేస్తారు.

నేడు వైఎస్‌ఆర్ వర్ధంతి

పాలసముద్రం: మండలంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ తులసి, జెడ్పీటీసీ అన్బలగన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పాలసముద్రం గుండుబావి దగ్గర ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సర్పంచ్ మహేష్ బాబు, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. క్రిష్ణజమ్మాపురం యూనిట్‌లోని గ్రామ సంఘం అధ్యక్షురాలు, కోశాధికారి మునియమ్మ, నిర్మల ఆధ్వర్యంలో సోమవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన చెరకు బెల్లం కొనుగోలుకు టీటీడీ సిద్ధంగా ఉందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో చేసిన కూరగాయలను, విక్రయించారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

వెదురుకుప్పం: మండలంలోని ధర్మాచెరువు గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే థామస్ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రైస్ స్మార్ట్ కార్డులను అందజేసినట్లు తహసీల్దార్ బాబు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసాయన రహిత కూరగాయలు శ్రేయస్కరం



కూరగాయల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం: రసాయన రహిత కూరగాయలు ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలో ప్రకృతి సిద్ధంగా పండించిన ఉత్పత్తులను మాత్రమే తీసుకోవాలన్నారు. అనంతరం ఏపీసీఎన్‌ఎఫ్ ట్రైనర్ హనుమంతు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగుచేయాలంటే ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని సులభమైన పద్ధతిలో పెట్టుబడుల ఖర్చు ఎక్కువ లేకుండా ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు చెంచులక్ష్మి, గౌరి, నాయకులు చెంగల్రాయ రెడ్డి, నాథమునిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలా నడవాలి.. ఎలా నడపాలి





ఆముదాల దళితవాడకు వెళ్లే బురద గ్రామీణ రోడ్డు, గ్రామ సచివాలయం సమీపంలో గుంతల్లో నీరు నిండిపోయిన రోడ్డు

పాలసముద్రం: మండలంలోని ఆముదాల దళితవాడ నుంచి చిత్తూరు–బలిజకండ్రిగ జాతీయ రహదారికి ఈ రోడ్డుపై ఎలా నడవాలి.. వాహనాలు ఎలా నడపాలి అంటూ స్థానికులు వాపోతున్నారు. బస్సు దిగిన తరువాత రెండు కిలోమీటర్ల దూరం వరకు ఈ రోడ్డుపైనే వెళ్లాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రోడ్డుపై బురదగుంటలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు విద్యార్థులు వెళ్లాలంటే కూడా బురదల్లో నడవాల్సిందే. ద్విచక్రవాహనచోదకులు వాహనం నడపలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం వస్తుందో?



కొళాయి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

నీళ్లివ్వండి సారూ!

నగరి: మున్సిపల్ పరిధి కాకవేడు ఆదిఆంధ్రవాడలో తాగునీటికి తిప్పలు పడుతున్నామని స్కూల్ వీధికి చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. వీధిలో కొళాయి ఉన్నా ప్రయోజనం లేదని అందులో నీరు రావడం లేదన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మున్సిపల్ సిబ్బందిని అడిగితే నీరు ఎక్కడం లేదని అందుకే రావడం లేదని చల్లగా చెప్పి జారుకుంటున్నారన్నారు. తమకున్న నీటి సమస్యలను అధికారులు తీర్చాలని కోరుతున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

గుడిపాల: గ్రామీణ ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. మండలంలోని తిమ్మయ్యపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



గుడిపాల: రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో వైద్యులతోపాటు మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి, నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): మహాసముద్రం ఫౌండేషన్, చిత్తూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పులిగుంటీశ్వరస్వామి దేవాలయం వద్ద సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగిన వైద్యశిబిరానికి సుమారు 109 మంది రోగులు వైద్యసేవలు అందుకున్నారు. మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి ప్రారంభించిన క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంలో తిరుపతి టాటా ట్రస్ట్ డాక్టర్లు వివిధ రకాల పరీక్షలు చేశారు. వైఎస్‌ఆర్ సీపీ మండల మాజీ కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, గంధం ముని, హరికృష్ణ, చిత్తూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు విజయకుమార్, టాటా ట్రస్ట్ మేనేజర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

రోగాల తిండి

మార్కెట్‌లో లభించే స్నాక్స్, ఇతర చిరుతిండ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతోపాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికర రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించే వారు కరువయ్యారు.

- చిరుతిండ్ల తయారీలో నాణ్యతకు తిలోదకాలు
- పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



నాణ్యత లేని తినుబండారాలు

నగరి: చిన్నారులు అమితంగా ఇష్టపడే స్నాక్స్‌పై కొందరు వ్యాపారులు దృష్టి కేంద్రీకరించారు. సంపాదనే ధ్యేయంగా నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చేస్తున్నారు. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా అంటే ఒకటి, రెండు అక్షరాలు మార్చివేసి మార్కెటింగ్ చేస్తూ వేగంగా విక్రయాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని హోల్‌సేల్ దుకాణాల ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చిన్నచిన్న దుకాణాలకు సరఫరా కావడంతో శరవేగంగా అమ్ముడుపోతోంది. చెన్నై, తిరుపతి నుంచి ఒక్కో హోల్‌సేల్ వ్యాపారి నెలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తినుబండరాలు తెచ్చేందు కోసం వెచ్చిస్తున్నారు.

ప్యాకెట్‌కు రూపాయి కమీషన్

బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే కుర్కురే, కరాచీ, చిప్స్ తదితర తినుబండరాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై 50 పైసలు కమీషన్ వస్తుంది. అదే నాసిరకం తినుబండరాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రెట్టింపు అంటే రూపాయి కమీషన్ వస్తుండడంతో చాలా మంది వ్యాపారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ చిప్స్ 12 ప్యాకెట్లు ఉండే ఒక షీట్ అమ్మితే రూ.6 కమీషన్ వస్తుంది. అదే నాసిరకం చిప్స్ అమ్మితే రూ.12 వస్తుంది.

నామమాత్రంగా తనిఖీలు

మార్కెట్‌లో లభించే చిరు తినుబండరాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, మున్సిపల్, తూనికలు, కొలతల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు పర్యవేక్షణను గాలికొదిలేశారని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. మార్కెట్‌లో దొరికే చిరుతిండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండడానికి పలు రకాల రసాయనాలు వాడుతారు. రుచి ఎక్కువగా ఉండడానికి అధిక మోతాదులో మసాలాలు, టేస్టింగ్ సాల్టు కలుపుతారు. రంగుల కోసం పలు రకాల పౌడర్లు ఉపయోగిస్తారు. వీటిని పిల్లలు ఎక్కువగా తింటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తప్పవని, ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి



మార్కెట్‌లో దొరికే చిరుతిండ్లు, జంక్ ఫుడ్స్‌కు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వాడే రసాయనాలు, రంగులతో కడుపు నొప్పి, అజీర్తి తదితర తక్షణం సంభవించే వ్యాధులతోపాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశం, పేగు సంబంధిత వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం ఉంది. –డాక్టర్ కార్తీక్, ప్రభుత్వ వైద్యులు, నగరి ఏరియా ఆస్పత్రి

నత్యామృతం



నృత్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం: కాణిపాకం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవస్థానంలో సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాకారులు కూచిపూడి నాట్యం చేస్తుంటే ఆహుతులు మంత్రముగ్ధులయ్యారు. భరతనాట్యంతో భళా అనిపించారు. వారి ముఖంలో పలికించిన హావభావాలు అమోఘం. హరికథ కాలక్షేపం, భక్తిగీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాట భజనలతో ఆస్థాన మండపం వేదిక దద్దరిల్లింది.